
# గుండె చప్పుళ్ళు

## నానీలు



**కేతవరపు రాజ్యశ్రీ**



చిత్రభాను ఉగాది కవిసమ్మేళనంలో
పాల్గొన్న సందర్భంగా
**డా॥ అక్కినేని నాగేశ్వరరావు** గారి
చేతుల మీదుగా బహుమాన స్వీకృతి



'చిరుసవ్వడులు' కవితాసంపుటి ఆవిష్కరణ.
ముఖ్యఅతిథిగా డా॥ ఆవుల మంజులతగారు,
ఆవిష్కరణ డా॥ పి. మధుసూదనరావుగారు
డా॥రావూరి భరద్వాజగారు ఆశీఃప్రసంగం కావించారు.



చిరుసవ్వడులు పుస్తకావిష్కరణసందర్భంగా
డా॥ రావూరి భరద్వాజ గారిచే సత్కారం

# గుండె చప్పుళ్ళు

## నానీలు

## కేతవరపు రాజ్యశ్రీ

ప్రచురణ - 2009

**గుండె చప్పుళ్ళు**

కె. రాజ్యశ్రీ

ప్రథమ ముద్రణ - 2009

కాపీలు : 500

హక్కులు రచయిత్రివి

ముఖ చిత్రం : ఎస్. రామనరసింహం (సరసి)

ప్రతులకు:
శ్రీమతి రాజ్యశ్రీ
క్వార్టర్ నెం.బి 19/ఎఫ్ 4, ఉద్యోగనగర్ కాలనీ,
పంజాగుట్ట, హైదరాబాదు - 500 082.
ఫోన్ : 23350991, సెల్ : 98499 06467

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ అన్ని బ్రాంచీలలో
ఫోన్ : 040-2473 5905


డి.టి.పి.: కె. బాలకృష్ణ, హైదరాబాదు.

ముద్రణ : కాంతి కంప్యూటర్ డేటా సిస్టమ్స్, హైదరాబాదు.

వెల : రూ.50/-

గ్రంథాలయ ప్రతి - రూ.100/-

# అంకితం



అ　అవిశ్రాంత నటుడు

క్కి　కిరీటం లేని సినీ రేడు

నే　నేటి నటులకు మార్గ దర్శకుడు

ని　నిరంతర అన్వేషకుడు

నా అభిమాన నటుడు

'దాదా సాహెబ్ ఫాల్కే' అవార్డు గ్రహీత

'నట సామ్రాట్' బిరుదాంకిత

పద్మభూషణ్

డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావుగారికి

ఈ 'నానీ'లతో చేస్తున్నాను

అక్షరాభిషేకం.

# ఇందులో


| | | |
|---|---|---|
| ముందుమాట | : | v |
| 'గుండె చప్పుళ్ళు' వినిపించే వా'మన' కవిత్వం | : | vii |
| విశ్లేషణ | : | ix |
| సమీక్షణం | : | xiii |
| శుభాకాంక్షలు | : | xvii |
| ప్రశంశ | : | xx |
| ఒక్క నిముషం | : | xxi |
| కృతజ్ఞతలు | : | xxii |
| నానీలు | : | 1 |

**మండలి బుద్ధ ప్రసాద్**
రాష్ట్ర పశు సంవర్ధక, పాడి పరిశ్రమ అభివృద్ధి,
పశు విశ్వవిద్యాలయము మరియు మత్స్య శాఖామాత్యులు
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం.

ఆంధ్రప్రదేశ్ సచివాలయం
హైదరాబాద్
ఆం.ప్ర., ఇండియా.
సెల్ : 98480 41767

# ముందుమాట

తెలుగు సాహిత్యం ఒక సజీవ స్రవంతి. సజీవ స్రవంతే కాదు నిరంతర పరిణామశీలి. ఆదికవి నన్నయ్యకు ముందు నుంచీ లభిస్తున్న తెలుగు భాషా సాహిత్యాలలో కాలానుగుణంగా ఎన్నో మార్పులు, కొత్తపోకడలు చోటు చేసుకున్నాయి. 20వ శతాబ్దం ప్రారంభంలో మొలకెత్తిన స్వేచ్ఛా కవిత్వం ప్రక్రియాపరంగా నిర్మాణ స్వేచ్ఛ కలిగివుండి, ప్రజాస్వామ్యభావ ప్రపూరితమై, సమాజనిష్ఠానికి, ప్రధాన్యతను ఇస్తున్నది. ఇందులో అన్ని వాదాలు, సిద్ధాంతాలు, అభిప్రాయాలు, ఆదర్శాలు ఇమిడిపోతాయి.

శాఖోపశాఖలుగా విస్తరించిన స్వేచ్ఛాకవిత్వానికి చెందిన ఒక శాఖ నానీలు. ఆచార్య ఎన్. గోపిగారి మేధోమథనం నుంచి రూపుదిద్దుకున్న నానీలు, వీటి అర్థం ఏమైనప్పటికీ, అనతికాలంలోనే అన్ని స్థాయిల తెలుగు సాహితీవేత్తలను ఆకర్షించడం విశేషం. ఈ నానీలను పూర్తి స్వేచ్ఛా కవిత్వమని కూడా చెప్పలేము. ఛందో నియమం లేకపోయిన్పటికీ వీటికి ఒక అక్షరనియమం ఉంది. కొండంత భావాన్ని ఇరవై నుండి ఇరవైఅయిదు లోపు అక్షరాలలో ఇమడ్చటం ఇందులో విశేషం. ఏ నానీకి ఆ నానీయే ఒక స్వతంత్ర కవిత. ఈ విధంగా ఇవి పూర్వపు మనచాటు పద్యాల వంటివి.

శ్రీమతి కేతవరపు రాజ్యశ్రీ రాసిన "గుండె చప్పుళ్ళు" నానీలు చూశాను. సచివాలయంలో అసిస్టెంట్ సెక్రటరీగా ఉద్యోగబాధ్యతలు నెరపుతూనే, సాహిత్యాభిలాష కలిగివుండటం ఆమె ఉత్తమాభిరుచికి నిదర్శనం. ఇందులో కొన్ని మెరికల్లాటి నానీలు నా దృష్టిని ఆకర్షించాయి. మచ్చుకు..

"సేద తీరుదామని
పల్లెకు వెళ్తా
బాంధవ్యం
కృత్రిమంగా నవ్వింది."

"చెత్త కుండీల్లో
చిత్తు కాగితాలే కాదు
పిల్లలు కూడా
దొరుకుతున్నారు"


"కలం చిన్నదే
దాని గళం
జాతి యావత్తునూ
చేస్తుంది జాగృతం"

"గారాల పట్టి ఆమె
పుట్టింట
పెళ్ళికాగానే మరమనిషి
మెట్టి నింట"

ఇట్లా రాస్తూ పోతే ఎన్నో ఉన్నాయి. రాజ్యశ్రీగారి నానీల్లో దేశభక్తి, రాజకీయ స్పృహ, భగవద్భక్తి, ఆధ్యాత్మిక చింతన, స్త్రీ వివక్ష, ఆత్మాభిమానం వంటి ఎన్నో అంశాలు చోటు చేసుకున్నాయి. విభిన్న విషయాల మీద ఆమెకు గల అవగాహనకు ఈ నానీలు అద్ధం పడుతున్నాయి. భావం పదునైన బాణంగా సూటిగా మనసుకు తగులుతుంది.

రచనా వ్యాసంగానికి మాత్రమే పరిమితం కాకుండా రాజ్యశ్రీగారు "చేతన" సచివాలయ సారస్వత వేదిక కార్యవర్గంలో ముఖ్య భూమికను పోషిస్తూ, సచివాలయ ఉద్యోగులలో సాహిత్యాభిలాషను పెంపొందిస్తూ, వారిని ప్రోత్సహించడం అభినందనీయం. ఉత్తమ సాహిత్యాభిరుచిగల రాజ్యశ్రీగారి కలం నుంచి మరిన్ని రచనలు రావాలని ఆశిస్తున్నాను.

(మండలి బుద్ధప్రసాద్)



# 'గుండె చప్పుళ్ళు' వినిపించే 'వా'మన' కవిత్వం

గుండె చప్పుళ్ళు..... ఎవరిగుండె చప్పుళ్ళు? ఏమిటా గుండె చప్పుళ్ళు? గోరుముద్దలు తినిపించే అమ్మ ప్రేమ గుండెచప్పుళ్ళు... పక్షిరాగాలకు, చెట్ల సందడుల మధ్యగల సంబంధాన్ని భావస్ఫోరకంగా తెలిపే చప్పుళ్ళు, అలల గలగల్లోని అంతరార్థం తెలిపే చప్పుళ్ళు 'ఆమె' ప్రేమలోని మూగవేదన వినిపించే చప్పుళ్ళు... చితిమంటల చిటపటల్లోగల వైరాగ్యం తెలిపే చప్పుళ్ళు.

ఇలా ఒకటేమిటీ? మర్రి విత్తనమంత కవిత్వంలో మహావృక్షమంత భావాన్ని పొదిగినట్టు, ఆలోచనల్ని రగిలించి అక్షరాల్ని సృష్టించినట్టు రాజ్యశ్రీ ఆవిష్కరించిన నానీల్లో 'నా-నీ' అన్న భేదం లేకుండా అందరి గురించి, అన్నిరంగాలను రంగరించి అలతి పదాలతో అలవోకగా ఆవిష్కరించారు.

నిశితంగా పరిశీలిస్తే అమ్మగా, ఆత్మీయురాలిగా, ఉద్యోగినిగా, సిద్ధాంతిగా, వేదాంతిగా అనుభవాలకు అక్షరరూపం ఇవ్వడమేకాక పరిణతి చెందిన రచయిత్రిలా అనుభూతి కవిత్వాన్ని, భావుకతను, సామాజిక స్పృహను, సర్రియలిజాన్ని, స్త్రీవాదాన్ని, స్పృశించారు. రాజ్యశ్రీ నానీల వస్తు విశ్లేషణ అలా ఉంచితే, నానీల గురించి కూడా ఈ సందర్భంగా కొంత చెప్పుకోవాలి. నానీల మీద ఇప్పటికే ఎన్నో పుస్తకాలు వచ్చాయి.

'తంగేడుపూల' గోపి సృష్టించిన ముచ్చటైన వినూత్న ముక్తక ప్రక్రియనానీ. పద్య, గద్య, గేయ, మాత్రా ఛందస్సులతో అలరారే తేట తెనుగు తీపి కవితకు 'నానీ' అదనపు అందగింపు. నాలుగేపంక్తులు.. పాతికకు మించని అక్షరాలు. అనల్పభావాన్ని స్వల్పాక్షరాలలో పేర్చి కూర్చి వెలార్చేదే నానీ. శర్దూలాలూ మత్తేభాల నుండి భుజంగ ప్రయాతం, మత్తకోకిలల వరకూ మనకెన్నో రీతుల

పద్యాలున్నాయి. దేని అందం దానికే. కవి తన భావ శబలతను బట్టి, 'వృత్త' సత్తాను బట్టి ఏ పద్యాన్నైనా ఎంచుకోవచ్చు. మాత్రాఛందస్సులు ఉండనే ఉన్నాయి. ఇవన్నీ సాంప్రదాయికమైనవి. భాషారీతులలో మార్పులు వచ్చినట్లే, కాలగతిలో ఆధునిక అవసరాలకు తగినట్లు కొత్త ప్రక్రియలూ వచ్చి చేరుతాయి. హైకూల్లాంటివి అన్యభాషా ప్రయోగాలైనప్పటికీ తెలుగుదనాన్ని సంతరించుకున్నాయి. అయితే 'నానీ' మాత్రం మన ఇంట్లో పుట్టిపెరిగిన చిట్టిపొట్టి చిన్నారే. ఆధునిక కవితాశైలి సామాన్యప్రజల సంభాషణాస్థాయికి రావాలని ప్రతిపాదించి ఒక ఉద్యమమే లేవదీశారు కుందుర్తి.

ఆయన వచన కవితకు బంధనాలు లేవు. అది అన్ని వలయాలనూ దాటిన కవిత. అయితే అది శ్రుతిమించి కవితా లక్షణాన్ని పోగొట్టుకునే దాకా పోయిందన్నది ఒక విమర్శ. ప్రక్రియ ఏదైనా సరే అందులో విధిగా కవితా రసస్పర్శ ఉండితీరాలి. లేకపోతే అది శుష్కవచనంగానే మిగులుతుంది. దీంతో అంతా ఏకీభవిస్తారనే భావిస్తాను. కవితారసం నీరసించిన అనేక పద్యాలు మనకు తెలుసు. ఛందస్సుల్లో ఉండేది మాత్రమే కవిత్వం కానట్టు, వచన కవితా రీతిలో ఉండినంత మాత్రాన్నే కూడా అది కవిత్వం కాదు. కవిత రసాత్మక వాక్యం. అది ఉత్పలమాల అయినా సరే, నానీ అయినా సరే, తెలుగునాట ప్రత్యేకించి కవిత్వంపై మోజు ఉంది. వంగదేశంలో లాగా ఏటా ఎన్నో కవితాసంపుటలు వెలువడడమే దీనికి దాఖలా. గోపీగారు నానీ ప్రక్రియను ప్రారంభించాక అందులోని సారళ్యం దృష్ట్యా ఉత్సాహులెందరో దానిని అనుసరించారు. అలా నానీలు గొప్ప కదలికనే తెచ్చినట్టు లెక్క. నానీల నిర్మాణంలో పంచ్ ఉంది అంటారు గోపి. అది కవి సమర్థతపైనే ఆధారపడి ఉంటుందనుకుంటాను.

**పక్షిరాగాలకు**
**పరవశించి**
**పూలూ పండ్లతో**
**సత్కరిస్తాయి చెట్లు**

ఇందులో లోతైన రెండు అర్థాల్ని మనం దర్శించవచ్చు.

**"వేళకి అన్నం తింటే**
**తృప్తి అమ్మకి**
**ప్రయోజకుడైతేనే**
**సంతృప్తి నాన్నకి".**

బిడ్డల పట్ల తల్లిదండ్రుల భావన అత్యద్భుతంగా అవిష్కృతమైంది ఇందులో.

**"ఆమె పరోక్షంలో**
**ఎన్నో మాట్లాడతా**
**సమక్షంలో**
**మాటరాని మూగనౌతా".**

ప్రేమ బీజాలు మొలకెత్తిన వ్యక్తి భావన ఇది. అయితే దీన్నే చమత్కారంగా తీసుకోవాలంటే గయ్యాళి భార్యా బాధితుడికీ అన్వయించవచ్చు!

**స్నేహితుడిగా**
**నా హితం కోరేవాడు**
**మొగుడయ్యాక**
**మగవాడినన్నాడు.**

పురుషాహంకారాన్ని ఎంత సింపుల్‌గా చెప్పారు?

రాజ్యశ్రీ అవిష్కరించిన నానీల్లో ఇవి కొన్ని 'మెచ్చు' తునకలు మాత్రమే. అలాగే శబ్దాల అసమర్థతా కొన్నిచోట్ల దర్శనమిస్తుంది. కృష్ణశాస్త్రి గారు చెప్పినట్టు, శబ్దాల అసమర్థత ప్రతి కవికీ ఏదో ఒక సందర్భంలో ఎదురౌతూనే ఉంటుంది. కవితా కామిని చేలాంచలాల కొస విసుర్లు ఎప్పుడూ ఒక బారెడు దూరానే మాయమైనట్టు అనిపిస్తాయి. అయితే వాటిని అందిపుచ్చుకొని ఆ స్పర్శలోని మధురిమను అనుభవించడం లోనే కవి సమర్థత కనిపిస్తుంది. ఆ విధంగా రాజ్యశ్రీ కొన్నిచోట్ల మంచిపదాల్ని ప్రయోగించారు. కొన్ని చోట్ల మాత్రం కాస్త శ్రద్ధ చూపితే బావుండేదేమో అనిపిస్తుంది. అయితే భావం ప్రధానంగా చూసి

నప్పుడు వీటిని పట్టించు కోనవసరం లేదనేదే చాలామంది 'నానీ' కవుల అభిప్రాయం. కాగా, రాజ్యశ్రీగారి నానీల విశ్లేషణ అలా వుంచితే, ఇప్పుడొస్తున్న నానీలన్ని అద్భుతంగా వస్తున్నాయనుకుంటే అది అర్ధసత్యమే అవుతుంది. "మనసులో మాట చెప్పేశా' అంటూ రంగనాయకమ్మ, 'ఆధునిక కవిత్వంలో బిందుసేద్యం' అంటూ అవంత్స సోమసుందర్ ప్రభృతులు నానీల తీరుతెన్నులపై విరుచుకుపడ్డారు. సులభంగా కవులమై పోవాలనుకునే వారికి నానీలు తేరగా దొరికాయన్నది వారి ఆరోపణ. మర్రి చెట్లని కుండీల్లో పెంచే బోన్సాయ్ టైపు కవిత్వమే నానీ అని దాని విమర్శకులు యద్దేవా చేస్తారు. 'ఆంధ్రప్రభ' సాహితీగవాక్షంలో నానీలపై పెద్ద యుద్ధమే నడిచింది. నానీకావివ్వండి. మరొకటేదైనా కానివ్వండి. అందులో కవిత్వం ఉంటేనే అది బ్రతుకుతుంది. లేకపోతే 'సహజ మరణం' తప్పదు. ఒక కవితా ప్రక్రియను బేరీజు వేసేప్పుడు దాని తాలూకు మెరుపులనూ పరిగణనలోకి తీసుకోవాలి. రాజ్యశ్రీగారి నానీల్లో పలుచోట్ల ఆ మెరుపు, విరపు, చరుపు, మనకు స్పష్టంగా అగుపిస్తాయి. ఉద్యోగినిగా విధులు నిర్వహిస్తూ, సచివాలయ సారస్వతవేదిక 'చేతన' నిర్వాహణ బాధ్యతలు నిర్వర్తిస్తూ, మరొకవైపు రచనా ప్రక్రియ సాగిస్తోన్న రాజ్యశ్రీగారికి అక్షరాభినందనలు!.

పి. విజయబాబు

(పి. విజయబాబు)
ఎడిటర్,
ఆంధ్రప్రభ

**S. RAMA DEVI**
Joint Secretary to Government



**BACKWARD CLASSES**
**WELFARE DEPARTMENT,**
D-Block, Ground Floor, Room No. 158A,
A.P. Secretariat, Hyderabad - 500 022.
✆ : Off : +91-40-2345 0361
Cell : +91-98499 04639

# విశ్లేషణ

"నవ్విపోదురుగాక నాకేటి సిగ్గు నాయిచ్చకేగాక నాకేటి వెరపు" అన్నారు కృష్ణశాస్త్రిగారు. నిజమే! కవిత్వం వ్రాయాలనుకునే వారెవరైనా వెరవాల్సిన పని లేదు. మనసులోని భావాలు అక్షరాకృతిని పొందేవరకూ ప్రసవవేదననుభవించే కవయిత్రి మనోభావాలతో మమేకం కాకుండా వుండగలమా? అభినందించ కుండా నిలువగలమా? కొమ్మకొమ్మ కోసన్నాయి, కోటిరాగాలు వున్నాయి అన్నట్టు ప్రతి కవి కవితలో వుంటాయి రాగాలు వినే మనసుంటే. "గుండె చప్పుళ్ళు" కవితాత్మకంగా వెలువరించిన శ్రీమతి కేతవరపు రాజ్యశ్రీని మనః పూర్వకంగా అభినందిస్తున్నాను. సునిశిత లోక పరశీలన, చక్కని చమక్కులు వీరి కవితల్లో గోచరిస్తాయి. అమ్మ మనసులోని అమృతాన్ని చవిచూసి మాతృమూర్తి గొప్పదనాన్ని యిలా అంటారు.

**'అమృతం కోసం**
**అర్రులు చాచాలా**
**అమ్మ మనసులోకి**
**తొంగిచూడు'**

**పదోన్నతి**
**"ఒంటరిని చేసింది**
**హోదాగల**
**పరదాలగదిలో"**
అని 'అధికారిని' అవిష్కరించినా

**"ప్రైవేటీకరణ ఫలితం**
**నేల మీదేకాదు**
**నింగిలో కూడా**
**ట్రాఫిక్ జాం"**

అంటూ ఆకాశంలో ట్రాఫిక్ జాం చేసినా వీరికే చెల్లుతుంది. వీరి కవితా "గుండె చప్పుళ్ళు" నూతనోత్తేజంతో నిరాఘాటంగా మనందరికీ వినిపించాలని ఆశిస్తున్నా...

**ఎస్. రమాదేవి**



# సమీక్షణం

శ్రీమతి రాజ్యశ్రీగారు ఇటీవలి కాలంలో వ్రాసిన నానీల సంపుటి 'చిరు సవ్వడులు' చదివాను. అందువల్ల ఆమె విద్వత్కుటుంబంలో జన్మించారనీ, జన్మతః లభించిన సంస్కారంతో బాటు సాహిత్యపు సుగంధం అబ్బిందనీ, మంచి కవిత్వం వ్రాయగలిగే ప్రతిభ ఆమెలో పుష్కలంగా దాగుందనీ గ్రహించాను. ఇప్పుడు వారు అందజేస్తున్న నానీల సంపుటి 'గుండె చప్పుళ్ళు' ఇందులో మొత్తం నూటఅరవై ఎనిమిది కవితలున్నాయి. పూర్తిగా చదివాను. అన్నీ బాగున్నాయి. అందరూ చదువుకోవచ్చు.

ఇందులో నాకు అనేక ప్రత్యేకతలు కనిపించాయి. తాను మహిళా రచయిత్రి అయినా ప్రత్యేకించి స్త్రీవాదానికో, విప్లవవాదానికో, పరిమితం కాకుండా సమాజంలోని అన్నికోణాలను దర్శిస్తూ, జీవనపథలో తాను పొందిన స్పందనలన్నింటినీ అక్షర రూపాలుగా చిత్రించటం, కవయిత్రిగా బాధ్యతను విస్మరించకపోవటం, వ్యక్తిగా భావపరిణితిని ప్రదర్శించటం ఎంతో వస్తు వైవిధ్యం ఉన్న చిరుకవితల సంపుటి ఇది.

ఇందులో వేర్వేరు అంశాలపై నాకు నచ్చినవి కొన్ని ఉదహరిస్తాను. చదివి ఆనందించండి. కావలసినన్ని ఉపమానాలు, అర్థాంతరన్యాసాలు, అలంకారాలు కనిపిస్తాయి. మచ్చుకు కొన్ని

1. మనోహరమైన ప్రకృతి వర్ణన

సూర్యుడొక్కడు తాంబూల మేసుకుంటే
ప్రకృతంతా ఎర్రబడింది.
భూదేవి రంగవల్లికలు చూసి ఆకాశం
చుక్కలతో ముగ్గులేయించుకుంది.

2. రమణీయమైన సూక్తులు.

పరలోక తాపయత్రం కాదు
ఇహలోకాన్ని అర్ధవంతం చేసుకోవాలి.
ఎదుటివారి మౌనం మనల్ని మనం
శోధించుకునేలా చేస్తుంది.
ఒక్కరే అయితే అనుభూతిని పంచేకోలేని
ఒంటరులవుతున్నారు.

3. సామాజిక దృశ్యాలు వాస్తవికత

యమబాధలు ఒకప్పటిమాట
పోలీసుదెబ్బలు ఈనాటిమాట.
జేబులో రూపాయి సంచిలోకొచ్చింది
కొన్న సరుకు జేబులోకి సర్దుకుంది.
సర్పంచి పదవి ఆమెదే
పెత్తనం చెలాయించేది మాత్రం పతిదేవుడు

4. భాషా సంస్కృతులు

భారతీయ సంస్కృతి ఇస్తోంది
ఎందరికో పరిశోధనాస్ఫూర్తి.
పద్యంకారాదు గతవైభవ సంస్కృతి
భవితకు కావాలి అది పునాది.

5. మాతృప్రేమ.

అమ్మతినిపించిన గోరుముద్దలు
ప్రేమానురాగాలకు పునాదులు.
అమ్మ కొంగుతో మొహాన్ని తుడుచుకున్నా హాయి
మొఖమల్ బట్టతోనైనా రాదు.

6. స్నేహము - ప్రేమతత్వం.

వెలకట్టలేని నేస్తానికి గాఢాలింగనమే
బహుమతిగా ఇచ్చా

7. కవితాచైతన్యం - ఆశావాదం.

ఒక మెప్పకోలు మాట
ప్రపంచాన్ని జయించగల శక్తినిస్తుంది.
ఉషోదయాన్ని ఉత్సాహంగా మొదలుపెడితే
రోజంతా ఉల్లాసంగా ఉంటుంది.

8. ఆధ్యాత్మిక చైతన్యం.

అరిషడ్వర్గాలపై సాధించు విజయం
అసమాన సౌందర్యం అయేను సొంతం
స్తుతి ఎంతపనయినా చేస్తుంది
దేవుణ్ణి దివినుంచి భువికి రప్పిస్తుంది.

9. స్త్రీలకు జరిగే అన్యాయం.

ఆనాడు కన్యాశుల్కం ఈనాడు వరకట్నం
ఏనాడూ లేదు మగువకు సుఖం.
మమతలగని మానవి హృదయం
గొడ్డళ్ళతో త్రవ్వుతున్నారు దాన్ని.

ఇలా ఎన్నో వైవిధ్యంతో కూడిన అంశాలతో, ఆద్యంతం సామాజిక స్పృహతో వ్రాసిన చక్కని చిరుకవితలతో ఈ గుండె చప్పుళ్లు మనల్ని ఆత్మీయంగా పలకరిస్తాయి. శ్రీమతి రాజ్యశ్రీ గారి కవిత్వంలో భావపరిపక్వత కనిపించినా పదాల ఎంపికల్లో ఇంకా కొంత పరిణతి సాధించాల్సి ఉంది. అయినా అన్ని కవితలు మెరుపురవ్వలలాగే ఉన్నాయి. ఆత్మసౌందర్యంతో అలరారు తున్నాయి. ఇంత చక్కని పుస్తకం అతి స్వల్పకాలంలోనే వ్రాసి ప్రచురించ గలిగినందుకు హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను. భవిష్యత్తులో మరెన్నో మంచి కవితలు వ్రాసి కీర్తి పొందాలని ఆశిస్తున్నాను.

**చిలుకూరి వెంకటప్పయ్య**
ప్రముఖ కవి / నాటక రచయిత
ప్రభుత్వ విశ్రాంత సహాయ కార్యదర్శి, హైదరాబాదు.



# శుభాకాంక్షలు

కవులు, కవయిత్రుల వ్యక్తిత్వాలు వారి కవిత్వంలో ప్రతిబింబిస్తాయన్నది మనం గమనిస్తున్న సత్యం. ఈ ప్రపంచంలో ఎంతోమంది మనం గమనిస్తున్న ఎన్నో ఆలోచనలు ఆ లోచనలలోని వైరుధ్యాల్ని, సంఘర్షణల్నీ, పరితాపాల్నీ, ఆనందాన్నీ, తన మనస్సులోకి స్వీకరించటంతో జరిగే అంతరంగ మధనం నుండి పెల్లుబికిన భావ తుంపరలతో రూపుదిద్దుకున్న కవితా సంపుటి కేతవరపు రాజ్యశ్రీ గారి 'గుండెచప్పుళ్ళు'గా అభివర్ణించవచ్చు. నిజంగా ఈ గుండె చప్పుళ్ళు వారి వరకే పరిమితం కావు. ప్రజలలో అంతర్గతంగా దాగిన గుండె చప్పుళ్ళను తనవిగా చేసుకొని, తన కలం ద్వారా వాటిని ప్రజల మధ్యకు చొచ్చుకుపోయేలా చేయటంలో కవయిత్రి సఫలీకృతులైనారని "గుండె చప్పుళ్ళు' కవితా సంపుటిని చదువుతున్నపుడు మనకు అర్థమవుతుంది.

చిరునవ్వడి చేస్తూ సాహితీ లోకంలోకి అడుగిడిన రాజ్యశ్రీగారి కలం పరుగెడుతూ ఈ గుండె చప్పుళ్ళను అందరికీ వినపడేటట్లు చేసింది. వీటిని నానీలనుకున్నా, మినీ కవితలనుకున్నా సాహితీ కొలమానాలకు పూర్తిగా నిలిచినా, నిలవకున్నా, చదివే పాఠకుల హృదయాలలో నిలిచి ఉంటాయని నిస్సందేహంగా చెప్పవచ్చును.

ఇక కవితల విషయానికొస్తే అమ్మ మనస్సులో అమృతంవుంటుందని **అమృతంకోసం / అర్రులు చాచాలా / అమ్మ మనసులోకి / తొంగి చూడు** అంటారు.

**'ఎంత కోపంగా వున్నా / దాసోహం అనగానే / శాంతిస్తుంది / అహం'** అని మానవ నైజాన్ని చక్కగా చిత్రీకరించారు.

**'మనసులోని భావాలు / అక్షరాకృతిని / పొందే వరకు / ప్రసవ వేదనే'** అంటారు కవయిత్రి. నిజమే మరి ఏ కవికైనా తన మనసులోని భావాలను కాగితంపై పెట్టేవరకు ఆవేదన, ఆరాటం అనేవి గుసగుసలాడుతూనే ఉంటాయి.

ఆత్మీయత, అభిమానాలకు ఒకప్పుడు పల్లెలు ప్రతి రూపాలుగా వుండేవి కానీ పల్లెలిపుడు పూర్తిగా మారిపోయాయి. అందుకేనేమో కవయిత్రి **'సేదదీరుదామని / పల్లెకు వెళ్తా / బాంధవ్యం / కృత్రిమంగా నవ్వింది'** అని చెప్పటం అనుభవ పూర్వకంగా చెప్పినట్లున్నది.

పాట కచ్చేరీలు జరుగుతున్నపుడు కొంతమంది ప్రేక్షకులు ప్రవర్తనను చూస్తే వాళ్ళు పాటలు వినటానికి వస్తారో లేక కబుర్లు చెప్పుకోవటానికి వస్తారో అర్థంకాదు. అందుకే కాబోలు **'పాడమంటారు / వినే ఓపికేదీ / గుస గుసలతోనే సరి'** అని తన అభిప్రాయాన్ని వ్యక్తీకరించారు రాజ్యశ్రీగారు. **'ఆకాశంలో హాయిగా / విహరించి / గూటికి చేరగానే / కిచకిచ పోట్లాట'** అని పక్షుల చేష్టలను చక్కగా వర్ణించారు కవయిత్రి. **'ఎన్నికలప్పుడు / వరాలజల్లులు / గెలిచాక గుర్తుకొస్తాయి / రూల్స్'** అంటూ నేటి రాజకీయ నాయకుల తీరును గర్హించారు. **'ఎన్ని బొమ్మలిచ్చినా / ఆగని ఏడుపు / అమ్మ చేతి స్పర్శతో / గప్‌చిప్'** ఈ కవితలో మనకు పిల్లల మనస్థత్వం, అమ్మ ప్రేమ రెండు పార్శ్వాలుగా గుర్తుకు వస్తాయి. **'ప్రేమిస్తే / పెద్దల గొడవ / లేదంటే యాసిడ్ దాటి / ఓ యువతీ-ఏదీ దారి/ అంటూ** ఈనాడు సమాజంలో కనపడుతున్న రుగ్మతలను ప్రశ్నించారు కవయిత్రి. నిజమే మరి ఇప్పుడు నేటి యువతులు ఏది సరైన దారో తెలియక తికమక పడుతున్నారన్న విషయం వాస్తవం.

దేశమంతటా ఈ రోజున వివిధ రాష్ట్రాలలోని ప్రభుత్వాలు పచ్చని పొలాలలో సెజ్‌లో ఏవిధంగా చిచ్చుపెడుతున్నారో రైతులకు జీవనాధరమైన పొలాలను బలవంతంగా లాక్కొని ఏవిధంగా వాళ్ళ జీవితాలను బలితీసుకుంటున్నారను విషయం మనం అనునిత్యం పేపర్లలో చదువుతూనే ఉన్నాము. అదే విషయాన్ని వారు నాలుగు లైన్లలో **'పచ్చటి పొలం / కార్ఖానాగా మారింది / రైతు గుండెనిండా / కాలుష్యపు పొగ'** అని చెప్పటం హృదయాలను హత్తుకునేలా వున్నది.

ఈ కవితా సంపుటిని చదువుతున్నపుడు మన మనసుకు నచ్చే కవితలెన్నో మనకు కనబడతాయి. ఒక కవితలో ఆమె చెప్పినట్లుగా **'కలం చిన్నదే / దాని గళం / జాతి యావత్తునూ / చైతన్యం** చేయగలదు. అనే వాక్యాలు ఈ కవితా సంపుటికి అన్ని విధాలా వర్తిస్తుందనే చెప్పవచ్చును.

'మతం' అనే పదం 'అభిమతం' నుండి వచ్చిందనే, ఎవరి అభిమతం మేరకు వాళ్ళు తమ ఆచారాలను అనుసరించ వచ్చునీ, వాటికి ఇతరులు అడ్డు తగల కూడదని ఒక సందర్భంలో సుప్రసిద్ధ నటులు డా॥ అక్కినేని నాగేశ్వరరావుగారు అన్నారు.

**మతిని శుద్ధి చేసేది / మతం / దాన్ని మరణహోమానికి / సమిధ చేస్తున్నాం** అని కవయిత్రి రాజ్యశ్రీగారు తన బాధను వ్యక్తం చేశారు.

డా॥ అక్కినేని నాగేశ్వరరావుగారిని మనం ఒక నటుడిగా మాత్రమే భావించ కూడదు. ఆయన ఒక మానవతావాది. ఆయనలో ఒక రచయిత కూడా దాగి ఉన్నాడు. తన అమెరికా పర్యటన అనుభవాలను పుస్తక రూపంలో కూర్చారు. 'నేను - నా జీవితం' అని తన జీవిత చరిత్రను రాసుకున్నారు. అంతేకాక 'అ ఆ' లు అనే పేరుతో తన ఆలోచనలకు అక్షర రూపాన్నిచ్చారు. వాస్తవాలనెన్నిటినో 'అఆ'లలో ఆవిష్కరించారు. అటువంటి ఒక రచయిత, మహానటుడు, మానవతా వాదికి ఈ పుస్తకాన్ని అంకితం ఇవ్వటం ఎంతో సముచితంగా వుంది.

ఈ సందర్భంగా కవయిత్రి కేతవరపు రాజ్యశ్రీగారికి శుభాకాంక్షలు అందిస్తూ మరిన్ని మంచి రచనలు ఆమె కలం నుండి వెలువడాలని ఆకాంక్షిస్తున్నాను.

**పొత్తూరి సుబ్బారావు**
ప్రముఖ రచయిత, సంపాదకులు
సాహితీ తేజమ్



# ప్రశంస

భగవంతుని సాన్నిధ్యాన్ని చేరటానికి కర్మ, జ్ఞాన, యోగ, భక్తి మార్గాలవసరం. భక్తి మార్గం అత్యంత కష్టం. అటులనే సాహితీ ప్రక్రియలో కవితా ప్రక్రియ కష్టతరమైనది. ఉన్నత ప్రభుత్వ ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూ "చిరుసవ్వడులు" సృష్టించి "గుండె చప్పుళ్లు" మన ముందుకు తీసుకొస్తున్న శ్రీమతి రాజ్యశ్రీ ప్రశంశనీయురాలు. సమాజంలోని పలు కోణాలను స్పృశించి అత్యంత సరళంగా 'నానీలు' రచించి, చదువరులను జాగృతి పరచటం కవయిత్రి ప్రత్యేకత. "గుండె చప్పుళ్ళు" నానీల సంపుటిని తన అభిమాన నటుడు డా॥ అక్కినేని నాగేశ్వరరావుగారికి అంకిత మివ్వడం కవయిత్రి అదృష్టం. దీనిలో "ఆరాధన" భాగస్వామ్యం కావడం ఊహించని పరిణామం. శ్రీమతి రాజ్యశ్రీ రచనా రంగంలో వడివడిగా అడుగులు వేయడానికి కుటుంబ సభ్యులతో పాటు సహచర ఉద్యోగుల అభిమానం కూడా దోహదం చేస్తున్నాయి.

మున్ముందు మరిన్ని కవితలు రచించి ప్రచురించి కవితా రంగంలో అగ్రశ్రేణిగా ఎదిగేలా కృషిచేయాలని ఆశిస్తూ... ఆశీర్వదిస్తూ.....


విజయనగర్ కాలనీ,
హైదరాబాదు.

"కళాసారధి", "కళావశిష్ట" "కళాతేజ", "కళామైత్రేయ"
**గుదిబండి వెంకటరెడ్డి**
ప్రభుత్వ విశ్రాంత ఉపకార్యదర్శి
అధ్యక్షులు, 'ఆరాధన'
ఛైర్మెన్, జి.వి.ఆర్. ఇంటర్నేషనల్ కల్చరల్ ఫౌండేషన్

# ఒక్క నిమిషం

నా మొట్టమొదటి కవితా సంకలనం 'చిరుసవ్వడులు' ఆగష్టు 21, 2008లో దూరదర్శన్ డైరెక్టర్ డా॥ పాలకుర్తి మధుసూధనరావుగారి చేతుల మీదుగా ఆవిష్కరణ జరిగింది. ఈ సభకు ముఖ్య అతిథిగా డా॥ ఆవ్వల మంజులత గారు, విశిష్ట అతిథిగా డా॥ రావూరి భరద్వాజగారు విచ్చేసి కార్యక్రమాన్ని జయప్రదం చేయడం నాఅదృష్టంగా భావిస్తున్నాను.

'చిరుసవ్వడులు' పుస్తక సమీక్ష ఆంధ్రప్రభ, ఈనాడు, ఆంధ్రభూమి, భూమిక, పత్రిక, నేటి నిజం, సాహితీతేజమ్, మున్నగు పత్రికలలో ప్రచురించడం జరిగింది. చాలామంది సాహితీప్రియులు సమీక్షలు చదివి ప్రతులను పంపమని అడగడం, చదివిన తరువాత, "సామాజిక స్పృహ" కలిగిన కవితలుగా వాటిని పొగుడుతూ, వారి ప్రతి స్పందన తెలియచేయడం, నాకు మరపురాని మధురానుభూతి. సచివాలయంలోని సహోద్యోగులు కూడా నన్ను ప్రోత్సహిస్తూ తమ సాహిత్యాభిమానాన్ని చాటుకున్నారు. నాకు ప్రోత్తేజాన్ని కలిగించిన సాహితీ మిత్రులకు, చేతన కార్యవర్గ సభ్యులకూ, సహోద్యోగులకూ, పాత్రికేయులకూ హృదయపూర్వక ధన్యవాదాలు.

ఈ అభిమానం, నాలో నూతనోత్సాహాన్ని నింపడమేకాక, "చిరుసవ్వడులు" వెలువడిన తరువాత నేను ఏ అంశం మీద స్పందించినా, ఆ భావం ఒక 'నానీ'గా రూపు దిద్దుకుంటూ వచ్చింది. అందుకే మొదటి పుస్తకం వెలువడిన 8 నెలల లోపే నాలోని భావతుంపరులకు అక్షరాకృతిని కల్పించి "గుండె చప్పుళ్ళు"గా వెలువరించడం జరిగింది.

మొదటిది నా చిరు ప్రయత్నం. రెండవది నా గుండెచప్పుళ్ళు. సాహితీ కొలమానాలకు అందినా, అందక పోయినా ఈ చప్పుళ్ళను మీతో పంచుకోవాలని. ఈ ప్రయత్నాన్ని అభినందిస్తారని ఆశిస్తూ....

రాజ్యశ్రీ

# కృతజ్ఞతలు



ఈ గుండె చప్పుళ్ళకి

స్ఫూర్తి నాన్న

ప్రేరణ అమ్మ

నటనకే భాష్యం చెప్పిన 'నటసామ్రాట్' డా॥ అక్కినేని నాగేశ్వరరావుగారు నా 'కృతిని' అంకితమందుకోవడానికి అంగీకరించి నా అభీష్టం నెరవేర్చినందుకు నా ఆనందానికి అవధులు లేవు. కృతజ్ఞతలకి మాటలు చాలవు.

'ముందుమాట' రాసి అభినందించి ఆశీర్వదించిన గౌరవనీయ 'పశు సంవర్ధక శాఖామాత్యులు' శ్రీ మండలి బుద్ధ ప్రసాద్‌గారికి

నా కవితా సంకలనం 'చిరుసవ్వడులు' కీ, 'చేతన' నిర్వహించిన కార్య క్రమాలన్నింటికీ 'ఆంధ్రప్రభ'లో సమీక్షలు ప్రచురించి ప్రొత్సహించడమే కాక, ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులుగా వ్యవహరించడానికి అంగీకరించి, "గుండె చప్పుళ్ళు" 'నానీ'లను నిశితంగా పరిశీలించి, చక్కని విశ్లేషణతో, "గుండె చప్పుళ్ళు" వినిపించే వా'మన' కవిత్వం" రాసిన ప్రముఖ రచయిత, ఆంధ్రప్రభ సంపాదకులు శ్రీ పి. విజయబాబుగారికి

'చిరుసవ్వడులు' చదివి వారి పాండిత్యాన్ని జోడించి చక్కటి ప్రశంశాపత్రాన్ని రాసి నన్ను ప్రోత్సహించడమే కాక, ఈ నానీలను వివిధ కోణాల్లో సమీక్షించి వాటికి 'ప్రకృతి వర్ణన', 'రమణీయ సూక్తులు', 'సామాజిక దృశ్యాలు', 'వాస్తవికత', 'భాషా సంస్కృతులు', 'మాతృప్రేమ', 'స్నేహము-ప్రేమ తత్వము', 'ఆశావాదం', ఆధ్యాత్మిక చైతన్యం' 'స్త్రీలకు జరిగే అన్యాయం', అంటూ విశ్లేషణ చేసి 'సమీక్షణం' రాసి సొగసు చేకూర్చిన ప్రముఖ నాటక రచయిత, కవి శ్రీ చిలుకూరి వెంకటప్పయ్యగారికి

ప్రముఖ కవుల కవితలను ఉదహరిస్తూ, నా 'నానీలను వాటితో సమీకరిస్తూ, నాలోని కవితా గుండె చప్పుళ్ళు నిరాఘాటంగా వినిపించాలని ఆశీస్తూ, విశ్లేషణ చేసిన నెచ్చెలి మరియు సంయుక్త కార్యదర్శి, వెనుకబడిన తరగతుల శాఖ శ్రీమతి ఎస్. రమాదేవిగారికి

ఎందరో వర్ధమాన కవులను వారి "సాహితీ తేజమ్" పుస్తకం ద్వారా వెలుగు లోకి తీసుకొచ్చి ప్రోత్సహిస్తూ 'చిరుసవ్వడులు' పుస్తక సమీక్షను, నేను రాసిన 'యువత' అనే కవితను ప్రచురించి వుత్సాహ పరచడమేకాక, ఈ కృతిని పరిశీలించి వారి 'శుభాకాంక్షలు' అందజేసిన ప్రముఖ కవి, పాత్రికేయులు శ్రీ పొత్తూరి సుబ్బారావు గారికి

ఎందరో కళాకారులకు తోడ్పడుతూ, ఆవిష్కరణ సభలు నిర్వహించి కవులను ప్రొత్సహించండలోనే ఆనందాన్ని వెతుక్కునే వ్యక్తి 'కళాసారధి', ఛైర్మెన్, జి.వి.ఆర్. కల్చరల్ ఫౌండేషన్, 'ఆరాధన' సంస్థ అధ్యక్షులు శ్రీగుదిబండి వెంకట రెడ్డిగారు. నా మొదటి పుస్తకం 'చిరుసవ్వడులు' సమీక్ష, వివిధ పత్రికలలో రావడానికి వారి ప్రోత్సాహమే కారణం. అంతేకాకుండా ఈ నానీల సంపుటిని 'చేతన'తో కలిసి 'ఆరాధన' సంస్థ ద్వారా విడుదల చేయడం నాకెంతో ఆనందాన్ని కలిగించింది. తన దైన శైలిలో ఈ నానీలకు ప్రశంశలు కురిపిస్తూ, 'ప్రశంశ' రాసిచ్చిన 'కళాతేజ', 'కళామైత్రేయ' శ్రీ గుదిబండి వెంకట రెడ్డిగారికి

"గుండె చప్పుళ్ళ"కు అర్థవంతమైన రూపకల్పన చేసి కవర్ పేజికి వన్నె తెచ్చిన ప్రముఖ కార్టునిస్ట్ శ్రీ ఎస్. రామనరసింహం (సరసి)గారికి

ఈ పుస్తక ప్రచురణకు ప్రోత్సహించి, ఆర్థిక సహకారాన్ని అందించిన పితృ సమానులు, మా బావగారు శ్రీ కేతవరపు సుబ్రమణ్యంగారికి

ఈ సంపుటిని ఆవిష్కరించేందుకు అంగీకరించిన దూరదర్శన్ కేంద్ర డైరెక్టర్ డా॥ పాలకుర్తి మధుసూధనరావుగారికి, సభా ప్రారంభానికి సమ్మతించిన గిన్నీస్ రికార్డు హోల్డర్ డా॥ గజల్ శ్రీనివాస్ గారికి పుస్తక సమీక్షకు అంగీకరించిన శ్రీ లంక లక్ష్మీనారాయణగారికి, శుభాకాంక్షలు అందచేయడానికి అంగీకరించిన మా హోమ్‌శాఖ అదనపు కార్యదర్శి శ్రీమతి జి.డి. అరుణగారికి, కార్యక్రమ వ్యాఖ్యానానికి తన వాక్పటిమతో వన్నె తేవడానికి అంగీకరించిన రచయిత్రి, టి.వి. న్యూస్ రీడర్ కుమారి శ్రుతకీర్తికి, 'ఆమె' కవితా సంకలనానికి, నాచేత మొట్టమొదటి పుస్తక సమీక్ష చేయించి, గౌరవించిన ప్రముఖ రచయిత శ్రీ పెద్దూరి వెంకటదాసుగారికి, ఆడపడుచు శ్రీమతి కేతవరపు సరోజనిగారికి, పుస్తకావిష్కరణకు నన్ను వుత్సాహపరచి ప్రోత్సహించిన 'చేతన' కార్యవర్గ సభ్యులకు పేరు పేరునా, ప్రముఖ జర్నలిస్టు, మా సహోద్యోగి శ్రీ శారదా విజయబాబుగారికి, డి.టి.పి. చేసిన శ్రీ బాలకృష్ణకి, అందంగా ముద్రించిన కాంతి కంప్యూటర్ డేటా సిస్టమ్స్ వారికి, 'మా' టి.వి. న్యూస్ ప్రజెంటర్ కుమారి దేవిగారికి, మిత్రులు గంధం సుబ్బారావుగారికి, సాహితీ మిత్రులకు సహోద్యోగులకు, తనవంతు సహాయ సహకారాలు అందించిన నా ఆఫీసు అసిస్టెంటు కుమారి రేణుకకి

నా కవితా వ్యాసంగానికి అంతరాయం కలిగించకుండా మౌనంగా నా ఎదుగుదలను ప్రోత్సహిస్తున్న శ్రీవారికి ...

రాజ్యశ్రీ

# గుండె చప్పుళ్ళు

భారతీయ సంస్కృతి
ఇస్తోంది
ఎందరికో
పరిశోధనా స్ఫూర్తి.

అమ్మ తినిపించిన
గోరుముద్దలు
ప్రేమాను రాగాలకు
పునాదులు.

నోట్లో
నాలికిచ్చాడు దేవుడు
తన అడ్రస్
అడిగైనా తెలుసుకోమని.

అరిషడ్వర్గాలపై
సాధించు విజయం
అసమాన సౌందర్యం
అయేను సొంతం.

అమృతం కోసం
అర్రులు చాచాలా?
అమ్మ మనసులోకి
తొంగిచూడు.

సూర్యుడొక్కడు
తాంబూలమేసుకుంటే
ప్రకృతంతా
ఎర్రబడింది.

ఎంత కోపంగావున్నా
దాసోహం అనగానే
శాంతిస్తుంది
అహం.

ఇలను
స్వర్గం సృష్టించాడు విధాత
సుకృతాన్ని బట్టీ
రాశాడు తలరాత.

డబ్బిచ్చి
పాడు చేస్తున్నానని తెలుసు
అయినా అమ్మతనమే
గెలుస్తోంది.

పక్షిరాగాలకు
పరవశించి
పూలూ పండ్లతో
సత్కరిస్తాయి చెట్లు.

ఒక మెప్పుకోలు
మాట
ప్రపంచాన్ని జయించగల
శక్తినిస్తుంది.

చితిమంట
స్థిత ప్రజ్ఞతకలది
ఎన్ని శవాల్ని కాల్చినా
దుఃఖించదు.

విచిత్రం!
బిడ్డను చేతికివ్వగానే
పురిటి నెప్పులు
మటుమాయం.

నిశ్శబ్ద రాజ్యం
మిట్ట మధ్యాహ్నం
ఆటపాటల తోట
సాయంకాలం.

మనసులోని భావాలు
అక్షరాకృతిని
పొందేవరకూ
ప్రసవ వేదనే !

అతీంద్రియ
శక్తిమీద విశ్వాసమే !
ఇంద్రియశక్తి
దాన్ని సడలిస్తోంది.

అమ్మకొంగుతో
మొహం తుడుచుకున్న హాయి
మొఖమల్ బట్టతోనైనా
రాదు.

చినుకు కోసం
తపిస్తే
జడివానలు కురిసి
కొంప కొల్లేరయింది.

సేద తీరుదామని
పల్లెకు వెళ్లా
బాంధవ్యం
కృత్రిమంగా నవ్వింది.

మెరుపు క్షణికం
ఎన్నిటికో ఉపమానం
జీవితం - అంతే!
అలా మలుచుకో!

వేళకి అన్నంతింటే
తృప్తి అమ్మకి
ప్రయోజకుడైతేనే
సంతృప్తి నాన్నకి.

అట్టహాసం
విమాన ప్రయాణం
అనుభూతుల పందిరి
రైలు ప్రయాణం.

ఒక్కడుంటే
బుద్ధిమంతుడే !
నలుగురితో కూడేసరికి
పోకిరీ !

సూర్యుడున్నచోట
చీకటిలా
జ్ఞానమున్నచోట
అహంకారముండదు.

చంకలో పిల్లాడి
ఆకలి తీర్చడానికి
గర్భసంచీ అద్దెకిస్తోంది
అమ్మ.

భూదేవి
రంగవల్లికలు చూసి
ఆకాశం చుక్కలతో
ముగ్గులేయించు కొంది.

యమ బాధలు
ఒకప్పటి మాట
పోలీసు దెబ్బలు
ఈనాటి మాట.

పరలోక
తాపత్రయం కాదు
ఇహలోకాన్ని
అర్థవంతం చేసుకోవాలి.

చిరునామా మార్చుకుని
మెట్టింటిని
ప్రేమకు చిరునామాగా
చేస్తుంది స్త్రీ.

ఎదుటివారి మౌనం
మనల్ని మనం
శోధించుకునేట్టు
చేస్తుంది.

జారిన బాల్యాన్ని
వెదుకుతూ
మొగలి పొదలో
చిక్కుకున్నారు.

ప్రపంచాన్నే కాదు
మానవ సంబంధాలనూ
మానీటర్లో
చూసుకుంటున్నాం.

జేబులోని రూపాయి
సంచీలో కొచ్చింది
కొన్న సరుకు
జేబులో సర్దుకుంది.

ఆనాడు కన్యాశుల్కం
ఈనాడు వరకట్నం
ఏనాడూ లేదు
మగువకు సుఖం.

తల నెరిసిందని
భ్రమపడకు
వయసు ముసుగు
వేసుకున్నాడేమో!

మృత్యువు తోసుకొస్తే
మూసిన రైలు గేటు
తీసే వరకూ
ఆగలేదు.

ఏకాకిని
అంటావేమిటి?
సంసారబంధం నీడలా
నీ వెనుక మోసుకొస్తూ?

ఇంటివాతావరణం
హాయిగా వుంటేనే
వుద్యోగంలో
రాణింపు.

కన్నీళ్లు
కళ్లతోబాటు
మనసుని కూడా
శుభ్రపరుస్తాయి.

సూర్యచంద్రుల గ్రహణం
తాత్కాలికం
మనసుకు పడితే
జీవితమే వ్యర్థం.

చెత్తకుండీల్లో
చిత్తు కాగితాలే కాదు
పిల్లలు కూడా
దొరుకుతున్నారు.

వాతావరణ
హెచ్చరిక విని
గొడుగు మోసుకెళ్లా !
ఎండ కాసింది.

ఆమె పరోక్షంలో
ఎన్నో మాట్లాడతా
సమక్షంలో
మాటరాని మూగనౌతా !

అల మనల్ని స్పృశిస్తే
ప్రమోదం
అదే కౌగిలిస్తే
ప్రమాదం.

మమతల గని
మానవి హృదయం
గొడ్డళ్లతో
తవ్వుతున్నారు దాన్ని.

ఒక్కర్నే కంటే
అనుభూతిని
పంచుకోలేని
వంటరులవుతున్నారు.

స్నేహం పరిధి
పెరిగింది
బంధుత్వ బాధ్యత కూడా
తీసుకుంది.

సాంప్రదాయపు
సూర్యనమస్కారాలు
ఆధునిక
'సన్‌బాత్' లయ్యాయి.

చంద్రుడి నిష్క్రమణతో
పరుగు మొదలు
సూర్యుడితో పందెం
గెలవాలని.

భేషజాల
పెద్దల సాన్నిత్యంకన్నా
పిల్లల సాన్నిహిత్యం
ఎంతో హాయి.

పాడమంటారు
వినే ఓపికేదీ?
గుస గుసల తోనే
సరి !

ఒకసారి ద్వేషం
మరోసారి ప్రేమ
చూసే దృష్టిదేనేమో
లోపం.

అతడి భావాలతో
మమేకమయితే
బాధే లేదు
వ్యక్తిత్వం చూపిస్తేనే !

వేదిక ఎక్కాక
తెలిసింది
ప్రేక్షక పాత్ర
బహు సుఖమని.

పున్నామ నరక
విముక్తులు
బ్రతికుండగానే
నరకం చూపిస్తున్నారు.

చంద్రుడి మీదకి
ప్రయాణం
సవ్యంగా జరగాలని
సర్వేశ్వరుడి ప్రార్థన.

అనుభవాల పంట
అమ్మమ్మ మాట
ఆలకిస్తే
భవిత బంగారు బాట !

ఆకాశంలో హాయిగా
విహరించి
గూటికి చేరగానే
కిచకిచ పోట్లాట.

ఎన్నికలప్పుడు
వరాల జల్లులు
గెలిచాక గుర్తుకొస్తాయి
రూల్స్.

జీత భత్యాలు
ఆఫీసు పనికి
డబ్బూ దస్కం లేనిది
ఇంటి నౌకరి.

వదిన
తల్లిలాంటిది
మరదలు మాత్రం
సరసాలకు వరస.

చంద్రుడికి మచ్చలా
హుస్సేన్ సాగర్
అందాలకి
ఆత్మహత్యల నింద.

అక్షరాస్యతకు
వెచ్చిస్తున్నాం కోట్లు
నిరక్షరాస్యతే లేకుంటే
నేత భవిత?

చెడు ఆలోచన
తొలిచేస్తుంది
మెదడుని
చెదపురుగులా !

ఎన్ని బొమ్మలిచ్చినా
ఆగని ఏడుపు
అమ్మ చేతి స్పర్శతో
గప్ చిప్.

కలం చిన్నదే !
దాని గళం
జాతి యావత్తునూ
చేస్తుంది జాగృతం.

పదవీచ్యుతుడు కాగానే
మొట్టమొదటిగా
గుర్తు కొచ్చేది
కులం.

ముంబైలో
ముష్కరుల దాడి
మానవత చాటడానికి
పార్టీల కుమ్ములాట.

సర్పంచి పదవి
ఆమెదే!
పెత్తనం చెలాయించేది మాత్రం
పతి దేవుడు.

బదులు కోసం
ఎదురు చూస్తే
అదిసాయం
ఎలా అవుతుంది?

ఐ.సి.యు.
చేర్చిన డాక్టరుకి లాభం
చేరిన రోగికి
ఒంటరి మరణం.

ఒక్కరోజు పడకేస్తే
వస్తుంది
జీవితానికి సరిపడా
వైరాగ్యం.

నాన్నను ఎలా
కన్విన్స్ చేయాలో
అమ్మ దగ్గర
రిహార్సల్స్.

మన పిచ్చుక గూళ్ళనే
పెద్దవిగా కట్టి
శాండ్ ఆర్ట్
అంటున్నారు.

పద్యం కారాదు
గతవైభవ సంస్కృతి
భవితకు అది
కావాలి పునాది.

న్యాయమా ! జోహార్లు
జనాన్ని క్రూరంగా
చంపినవాడి వైపు
వాదిస్తున్నావ్.

'స్వగృహ' పిండివంటలు
తగ్గించాయి అమ్మకు
వంటింటి
కడగండ్లు.

తన ప్రియుడు
అందరి కంటే భిన్నం
అనుకుంటుంది
ప్రతీ ప్రేమిక.

వెల కట్టలేని
నేస్తానికి
గాఢాలింగనమే
బహుమతిగా యిచ్చా !

పల్లెటూరు బడిలో
పోస్టింగ్
పంతుళ్లు మాత్రం
సిటీలో సిట్టింగ్.

ఇందిరమ్మ ఇళ్ళు
రాజీవ్ గృహకల్ప
ఎన్నున్నా తప్పదు
నాలాపై గుడిసె.

'సహనశీలి' బిరుదుతో
మురిసింది
'కట్టుబానిస' అయానని
తెలీదు.

డాక్టరు కన్సల్టేషన్
ఉచితమే!
రాసిచ్చిన మందులు
వేలల్లో.

మెదడుకి మేత
నోటికి మూత
పడేది
గ్రంధాలయంలోనే !

ఎవరికీ
ఏమీ చేయలేదు
అయినా
ఇంతటి వాళ్లయ్యారు.

జీవిత ఖైదంటే
ఫరవాలేదు
పంద్రాగస్టుకి
రిలీజవచ్చు.

కుంచించుపోకు
సమయం
వచ్చినపుడు
నువ్వేమిటో చూపించు.

ఆలోచనల వర్షానికి
నిరంతర
ధ్యానమే
ఆనకట్ట.

నుదుటి మీద
కుంకుమ బొట్టూ !
ఎన్ని వన్నె చిన్నెలు
పోతున్నావే!

నాగేంద్రా!
నీ పేరుంటే చాలు
కనకవర్షం
సినిమాకైనా - సీరియల్‌కైనా.

మైక్ చేతికిస్తే చాలు
విషయం మరచి
సొంత డబ్బాకే
ప్రాధాన్యంమరి.

బిచ్చగాడిని
విసుక్కున్నా !
మానవత్వం లేదని
మనసు సతాయించింది.

స్నేహితుడిగా
హితం కోరేవాడు
మొగుడయ్యాక
మగవాడి నన్నాడు.

చిన్న కుటుంబం
చింతలు లేనిది
చిన్నారికి
శిశువిహార్లే శరణం.

నాలిక భుజాన
వేసుకున్న వారికి
టాపిక్‌తో
పనేముంది?

రాతిలో రాగాలు
పలుకుతున్నాయి
రాతిగుండె
కరుగుతుందా మరి ?

పిల్లాడికి
దేశనాయకుడి పేరు పెట్టా
వాడిని తిట్టేహక్కు
కోల్పోయా !

ప్రైవేటీకరణ ఫలితం
నేలమీదే కాదు
నింగిలో కూడా
ట్రాఫిక్ జాం.

జాతి పురోగతే
'ఎజెండా' అనే
నాయకుడు దొరకలేదు
ఓటేద్దామంటే.

నీరసిస్తున్న బంధాలకు
ఉడతా భక్తిగా
మానవతా వారధి
నిర్మిద్దాం.

ఇంటిల్లపాదికీ
ఒకే సబ్బుండేది
స్త్రీ - పురుష భేదం చూపి
గడిస్తున్నారు.

నిరుద్యోగని
మొహంచాటేశా !
హోదాలో చూడగానే
స్నేహాన్ని గుర్తు చేశా.

మొదటి జీతం
సిగ్గుపడుతూ తీసుకున్నా
ఇప్పుడు
డబాయిస్తున్నా.

ఓపికంతా
ఆఫీసులోనే ఖర్చు
ఇంటి మొహం చూడగానే
'ష్' నిట్టూర్పు.

గారాల పట్టి ఆమె
పుట్టింట
పెళ్ళికాగానే మరమనిషి
మెట్టినింట.

ఆడ-మగ పుట్టుక
శాసించేది
మగ 'వై' క్రోమోజోమే !
నెపం 'ఆడ' మీద.

పల్లెరోగులంటే
రోత
హైటెక్ పేషేంట్లయితే
కాసుల పంట.

మనవడిలో
తన ప్రతిరూపం
వార్థక్యం మెలివేసింది
మీసం.

టాంక్ బండ్ మీద వర్షం
తెలుగు దిగ్గజుల
విగ్రహాలకు
అభిషేకం.

రూపాయంటేనే ప్రేమని
తెగేసి చెప్పాడు
విస్తుబోయింది
పెళ్లిపందిరి.

మనశ్శాంతి కోసం
ఎన్నివూళ్ళు తిరిగినా
మనసు మనతోనే
వస్తుంది.

ఫోన్ సంభాషణతో నైనా
ఇంట్లో వాళ్ల
ప్రోగ్రామ్స్
తెలుస్తున్నాయి.

ఖాదీ సిల్కు
కడుతున్నారు
గాంధేయం ముసుగులో
హోదా చూపిస్తున్నారు.

పేజీల మధ్య
నెమలి ఈక
పిల్లలు పెడుతుందని
బాల్యం ఎదురు చూపు.

వదంతులు పుట్టించి
చంపుతున్నారు !
ఇదో కొత్తరకం
ఆయుధం !

చెప్పకు
నోరులేదు కానీ
ఉన్నవాడి నోరు
మూయించగలదు.

వీడ్కోలు ఎప్పుడూ విషాదమే !
పెళ్లి వీడ్కోలు
సంతోష విషాద
సమ్మేళనం.

ముక్కు చీమిడి బిడ్డ
ముద్దొచ్చింది నేతకు
ఎన్నికలొస్తున్నాయి
కామోసు !

ప్రేమిస్తే
పెద్దల గొడవ
లేదంటే యాసిడ్ దాడి?
ఓ యువతీ - ఏదీ దారి?

కీర్తి దక్కేది
ప్రతిభను గుర్తించే
రసహృదయులు
ఉండబట్టే కదా !

ముచ్చటగా
ప్రహరీగోడకు రంగువేశా
నినాదాలతో
ముగ్గులు వేశారు.

'ఫలానా' అయితే
మినహాయింపులు
కాని వారికి
'చలానా' వడ్డింపులు.

అపుడు తెల్లదొరలు
ఇపుడు నల్లదొరలు
స్వాతంత్ర్యం
ఎపుడొొచ్చింది?

ఉలిదెబ్బకు
రాయి-రాముడౌతుంది
భరించినవాడే
భగవంతుడౌతాడు.

భార్యంటే ప్రేమే
ఆస్తి తన పేరున
బదిలీ కాగానే
ఆమె దోమే !

భాషంటే గౌరవం
యాసంటే చిన్న చూపు
మూలాలను
మరిచిపోతే ఎలా?

నిందపడిన వాడు సరే !
వేసిన వాడికి
నిరూపించాల్సిన
బాధ కూడా.

నాన్నంటే భయం
అమ్మను అడ్డంపెట్టుకుని
టి.వి. సినిమా
చూసేవాళ్లం.

ఉషోదయాన్ని
ఉత్సాహంగా మొదలుపెడితే
రోజంతా
ఉల్లాసంగా వుంటుంది.

వయసా !
పరుగులెట్టకు
ఈ అద్భుతాలను ఇంకా
ఆస్వాదించాలని వుంది.

బ్రతికుండగా
సుఖపెట్ట లేదు
గొప్పకోసం
ఘనంగా కర్మచేశాడు.

సెలయేటి గలగల
పక్షుల కిలకిల
కాంక్రీట్ జంగిల్‌కి
కలే !

కట్టేది ఖాదీ
తాగేది బ్రాందీ
నియమ రహితుల నీడ
నీతులు ఖాళీ.

అందెల సవ్వడి కోసం
ఆరాటం
అలసిన మేను విశ్రాంతి కోసం
పోరాటం.

సముద్రుడిలో నదులు
అస్తిత్వాన్ని కోల్పోతాయి
సూర్యకాంతిలో
చుక్కల్లాగా.

చట్టానికి అందని
హింస
కనిపెట్టడంలో
మానవ మేధస్సు దిట్ట.

అయితే ఏంటి?
అని మనసుకు
ఎదురు తిరుగు
బాధే వుండదు.

పచ్చటి పొలం
కార్ఖానాగా మారింది
రైతు గుండె నిండా
కాలుష్యపు పొగ.

కల కంటి కన్నీరూ
కడలి నీరూ
కట్ట దాటాయా
కడగండ్లే.

రోడ్లు వూడ్చి
నేతయాడు
కారు రేపిన దుమ్ములో
మసగ్గా ఓటేసిన జనం.

బిడ్డకు
తనపేరు పెట్టగానే
ముదిమి ముడతల్లో
విరసింది హాసం.

మెట్లు ఎక్కుతున్నాం
సరే !
మనుషులు
కనుమరుగవుతున్నారు కూడా !

సంస్థ ఎదుగుదల
సంతోషం కన్నా
తన హయాంలో
జరగలేదనే వ్యధ.

కళ్ళు ఎండిపోయాయి
వర్షించవట ఇక
ఇదోరకం
జబ్బు.

కట్నం తీసుకుంటే
బేడీలు
పేరు మార్చి
లాంఛనాలంటే పోలా?

దైవభక్తికి కొదువా
మైకుకి మతమూ లేవు
చదువుకి
పరీక్షలున్నాయి.

అగ్గిపుల్ల
తలచుకొంటె మల్ల
అవుతది పొల్ల
బతుకు గుల్ల.

విద్యార్థులు మెండు
ఉపాధ్యాయులు దండు
చదివేవారూ
చెప్పేవారే లేరు.

ఎన్ని మెగా బైట్స్
మెమరీ అయినా
మానవ మేధస్సు
తరవాతే !

చట్టాలను
చుట్టాలుగా
మార్చగలవారే
పేరున్న లాయర్లంటే.

ప్రేమకోసం
తపిస్తున్న వారు
నీలాగా ఎందరో
నీ ప్రేమతో సేదదీర్చు.

డిస్కౌంట్ల వలలో
అతివలు
క్యాష్ కౌంటర్ దగ్గర
భర్తల బెంబేలు.

ఆదివారానికి
రెస్టు లేదు
అన్ని పనులూ అయేసరికి
తెల్లారింది.

చేతకాని తనానికి
'నిజాయితీ' అంటూ
ముసుగు
వేసుకుంటూన్నామేమో !

గాయం మర్చిపోదామని
కన్ను మూస్తే
రెప్పకింద
సినీ రీలులా ప్రత్యక్షం.

'అరవం'
అంటూ అరుస్తారు
ఢిల్లీని కదిలిస్తారు
ప్రాజెక్టులు కొట్టేస్తారు.

మనం ఎక్కిన తరువాత
బస్సు ఏ స్టేజిలో
ఆగినా
అసహనమే.

అన్ని సినిమాలలో
కథా వస్తువు ప్రేమే !
తేడా అల్లా
హీరో హీరోయిన్లు.

కొందరి మృత్యువుకు
ఎదురు చూస్తాం
ఏడ్పులూ పెడబొబ్బలూ
ఉండవు.

ఐ.టి. పడిపోగానే
ప్రభుత్వ ఉద్యోగాలు
కంటికి
ఆనుతున్నాయి.

కలల్ని
నిజం చేసుకున్నా !
ప్రేమ ఆప్యాయతలు
తప్పకున్నాయి.

పచ్చగుంటే
కన్నెర్ర బడుతుంది
గ్రీన్ సిగ్నల్ వెంట
రెడ్ సిగ్నల్ లాగా.

కాళ్ళు నడుస్తున్నాయి
భూమ్మీద
మనసు
విహంగంలా ఆకాశంలో.

స్పీడు పోస్టు వచ్చాక
మామూలు ఉత్తరాలకి
సిగ్గేసి
గమ్యం చేరడం లేదు.

స్తుతి
ఎంతపనైనా చేస్తుంది
దేవుణ్ణి దివినుంచి
భువికి రప్పిస్తుంది.

పదోన్నతి
ఒంటరిని చేసింది
హోదాగల పరదాల
గదిలో.

మతిని శుద్ధి చేసేదే
మతం
దాన్ని మారణ హోమానికి
సమిధ చేస్తున్నాం.

"జీవితమే సఫలము"
పాట వింటున్నా
మనసు మూలిగింది
తీయగా.

తెలుగుభాషా మహోత్సవాలలో
కవిసమ్మేళన నిర్వహించి, పాల్గొనిన సందర్భంగా
ప్రధాన ఎన్నికల అధికారి
శ్రీ ఐ.వి. సుబ్బారావు, I.A.S. గారినుంచి
మెమెంటో స్వీకరణ.






రావూరి కాంతమ్మ భరద్వాజ ట్రస్ట్ వారు ఏర్పాటు చేసిన కవిసమ్మేళనాన్ని
నిర్వహించి, పాల్గొన్న సందర్భంగా డైరక్టరు, దూరదర్శన్ కేంద్రం
డా|| పాలకుర్తి మధుసూదనరావుగారిచే సత్కారం.

'పర్యావరణపరిరక్షణసదస్సు'
నిర్వహించిన సందర్భంగా
ఆం.ప్ర. కాలుష్యనియంత్రణమండలి,
ప్రత్యేక కార్యదర్శి శ్రీమతి ఆర్. శోభ, I.F.S గారితో





# రచయిత్రి గురించి

| | | |
|---|---|---|
| పేరు | : | **కె. రాజ్యశ్రీ,** ఎం.కామ్. |
| తల్లిదండ్రులు | : | ప్రభావతి, కీ॥శే॥ మహాకాళి వెంకటరావు |
| భర్త | : | కేతవరపు మాధవరావు, ఎం.టెక్ |
| పిల్లలు : కుమారుడు | : | కె.ఎస్.ఎల్. ఫణీంద్ర, ఎం.ఎస్. |
| కుమార్తె | : | కె. ప్రియాంక, ఎం.ఎస్. |
| వృత్తి | : | ప్రభుత్వ సహాయ కార్యదర్శి, హోమ్ శాఖ, సచివాలయం, హైదరాబాదు. |
| ప్రవృత్తి | : | కవితలు, కథానికలు, కథల రచనలు |
| కవితలు | : | రూపాయి (చేతన సచివాలయ సారస్వత వేదిక నిర్వహించిన కవితల పోటీలలో ద్వితీయ బహుమతి పొందినది.) సహస్రావధాని (ఒంగోలు, తెలుగు మహాసభలలో పలువురి ప్రశంసలు పొందినది.) 'గువ్వల చెన్నా' ఆం.ప్ర. అధికార భాషా మాస పత్రికలో ప్రచురితం: నానీలు – పత్రిక, చతుర మాస పత్రికలో 'యువత' అనే కవిత సాహితీతేజం పత్రికలో ప్రచురితాలు. |
| ఇతరములు | : | వ్యవస్థాపక కార్యదర్శి, ఆం.ప్ర. సచివాలయ మహిళా ఉద్యోగుల సంక్షేమ సంఘం: పూర్వ అధ్యక్షులు, సంఘమిత్ర లయెన్స్ క్లబ్: పూర్వ కార్యదర్శి, సంఘమిత్ర ఓల్డ్ ఏజ్ హోమ్: టి.వి. మరియు రేడియో ప్రోగ్రామ్స్‌లో మహిళలకు సంబంధించిన కార్యక్రమాలలో పాల్గొనడం: అధ్యక్షులు, చేతన సచివాలయ సారస్వత వేదిక, సచివాలయం. |
| ఇతర ప్రచురణలు | : | 'చిరుసవ్వడులు' కవితా సంపుటి |